క్లుప్తంగా

ఇన్‌చార్జ్ సీఈఓగా నరేశ్

భూపాలపల్లి రూరల్: జయశంకర్ భూపాలపల్లి జిల్లా జెడ్పీ సీఈఓ విజయలక్ష్మి మెడికల్ సెలవుపై వెళ్లినందున డీఆర్డీఓ నరేశ్ ఇన్‌చార్జ్ సీఈఓగా కలెక్టర్ భవేశ్ మిశ్రా అదనపు బాధ్యతలు అప్పగించారు.ఈ మేరకు శనివారం నరేశ్ జెడ్పీ సీఈఓగా బాధ్యతలు చేపట్టారు. విజయలక్ష్మి విధుల్లో చేరే వరకు నరేశ్ జెడ్పీ సీఈఓగా కొనసాగుతారని కలెక్టర్ పేర్కొన్నారు.

విద్యుత్ అంతరాయానికి సహకరించాలి

ములుగు రూరల్: విద్యుత్ అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని విద్యుత్ శాఖ ఏఈ సాయికృష్ణ శనివారం ఒక ప్రకటనలో కోరారు. విద్యుత్ లైన్‌ల మరమ్మతుల కారణంగా ఆదివారం ఉదయం 10 నుంచి 12 గంటల వరకు ములుగు పట్టణకేంద్రంలోని ములుగు-2 ఫీడర్ పరిధిలో రామాలయం వీధి, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం, పత్తిపల్లి రోడ్డు ఏరియాలో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు. వినియోగదారులు గమనించి సహకరించాలని ఏఈ పేర్కొన్నారు.

రుణమాఫీ చేయాలి

టేకుమట్ల: రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు రైతులకు రుణమాఫీ చేయాలని సీపీఐ ఎంఎల్ లిబరేషన్ జిల్లా కార్యదర్శి మారెపల్లి మల్లేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతులు తమ పంటలను పండించుకునేందుకు పెట్టుబడి కోసం బ్యాంక్‌ల్లో బంగారాన్ని సైతం తాకట్టు పెట్టి రుణం తీసుకున్నారని, క్రాఫ్ లోన్‌లతో పాటు తత్కాల్ లోన్‌లను కూడా మాఫీ చేయాలన్నారు. ఆరుగాలం కష్టపడి పండించిన పంటలకు గిట్టుబాటు ధర లేక పెట్టుబడి సైతం రాని రోజులున్నాయని, అప్పులు పెరిగి ఆత్మహత్యలు చేసుకున్న రైతులు ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

ఆర్థికసాయం

చిట్యాల: మండలంలోని జూకల్ గ్రామానికి చెందిన గొవికారి రాజేందర్(50) శనివారం అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబాన్ని మృతుడితో కలిసి పదో తరగతి చదువుకున్న శాఖామూరి అమర్ పరామర్శించి రూ.పదివేల ఆర్థిక సాయం అందజేశారు. మాజీ సర్పంచ్ పుట్టపాక మహేందర్, మిత్రులు మహేందర్‌రెడ్డి, చక్రపాణి, రాజయ్య, వెంకటేశ్వర్లు, భిక్షపతి ఉన్నారు.

కల్యాణ మహోత్సవానికి ఆలయం ముస్తాబు

ఏటూరునాగారం : మండలంలోని రొయ్యూర్ గ్రామంలో ఆదివారం జరగబోయే లక్ష్మీదేవర కల్యాణ మహోత్సవానికి ఆలయాన్ని సుందరంగా ముస్తాబు చేశారు. కల్యాణ మహోత్సవానికి గ్రామస్తుడు పూజారి ఈశ్వరయ్య కల్యాణం కోసం ఆలయానికి రంగులు వేయించారు. అలాగే అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. అలాగే బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మీనర్సింహారావు రూ.25వేలు ఆర్థిక సాయం చేసి కల్యాణాన్ని జరిపించనున్నారు. అలాగే రొయ్యూర్ మాజీ సర్పంచ్ జిట్ట సమత ఈశ్వర్‌లు రేకులషెడ్డును నిర్మించారు. కల్యాణానికి అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఈశ్వర్ తెలిపారు.

తీన్మార్ మల్లన్నను గెలిపించాలి

ములుగు: కాంగ్రెస్ పార్టీ తరఫున వరంగల్-ఖమ్మం-నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేస్తున్న తీన్మార్ మల్లన్నను భారీ మెజార్టీతో గెలిపించాలని డీసీసీ అధ్యక్షుడు పైడాకుల అశోక్, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి ధనసరి సూర్య పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలో శనివారం ఏ ర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడారు. స్వరాష్ట్రంలో నిరుద్యోగుల తరఫు న నిలబడి కొట్లాడిన వ్యక్తి మల్లన్న అన్నారు. గడిచిన పదేళ్లుగా ప్రజల మధ్యన ఉం టూ ప్రజా సమస్యలపై తనగొంతును వినిపిస్తున్నారని తెలిపారు. పట్టభద్రులు తమ మొదటి ప్రాధాన్యత ఓటు వేసి మల్లన్నను గెలిపించాలని కోరారు. సమావేశంలో యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు బానోత్ రవిచందర్, మండల అధ్యక్షుడు చాంద్‌పాషా, ప్రవీ ణ్‌కుమార్ ఉన్నారు.

'సాగు' చేసేదెలా?

గతేడాది తెగిన 21 చెరువుకట్టలు

- రూ.2.50కోట్ల నిధులు మంజూరు
- నైన్‌పాకలో తప్ప మరెక్కడా ప్రారంభం కాని పనులు
- ఆందోళనలో ఆయకట్టు రైతులు



తెగిన వెంట్రావుపల్లి(సి)లోని పెద్ద చెరువు

చిట్యాల: గతేడాది వానాకాలంలో అధిక వర్షాలకు చిట్యాల మండలంలో తెగిన చెరువు కట్టలకు మరమ్మతు పనులు నేటికీ నోచుకోవడం లేదు. 21 చెరువు పనులకు రెండు నెలల క్రితం రూ.2.50కోట్ల నిధులు మంజూరు కాగా ఇప్పటి వరకు నైన్‌పాకలో తప్ప మరెక్కడా పనులు ప్రారంభించలేదు. వానాకాలం సమీపిస్తుండడంతో ఈ సారి సాగు పరిస్థితి ఏంటని ఆయకట్టు రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ చెరువుల కింద సుమారు 1500 ఎకరాల ఆయకట్టు ఉంది.

గతేడాది భారీ వర్షాలకు మండలంలో 21 చెరువులకు గండ్లు పడి కట్టలు పూర్తిగా తెగిపోయాయి. అప్పటి ప్రభుత్వం మరమ్మతులు చేయకుండా వదిలేసింది. రెండు నెలల క్రితం ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు తెగిన చెరువులపై ప్రత్యేక దృష్టి సారించి 21 చెరువులకు గాను 18 చెరువులకు రూ. 2.50 కోట్ల నిధులు మంజూరు చేయించారు. పార్లమెంట్ ఎన్నికల కోడ్ వస్తుందని ముందుగానే హడావిడిగా పనుల కోసం శంకుస్థాపనలు చేశారు. అప్పటి నుంచి మండలంలోని నైన్‌పాక పెద్ద చెరువులో పనులు ప్రారంభించారు. మరే చెరువులోనూ పనులు ప్రారంభం చేయకపోవడం రైతులకు శాపంగా మారింది. ప్రస్తుతం వర్షాకాలం సమీపిస్తుండడంతో అధిక వర్షాల మూలంగా చెరువులోకి నీరు వస్తే.. నీరు నిలిచే పరిస్థితి లేదు. దీంతో చెరువు కింద ఆయకట్టు రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ సారి సాగు వదులుకోవాల్సిందేనా అని మదనపడుతున్నారు. ఎండాకాలంలో చేయాల్సిన పనులు ఇంతవరకు అధికారులు ఎందుకు ప్రారంభించలేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చెరువుల మరమ్మతులను ప్రారంభించాల్సిన అవసరం ఉంది.

త్వరితగతిన పూర్తి చేయాలి..



నాకు ఆయకట్టు చెరువు కింద 20 గుంటల భూమి ఉంది. నేను తినేందుకు ప్రతీ సంవత్సరం వరి పంట వేస్తాను. కానీ ఈ సంవత్సరంలో వరి పండే పరిస్థితి కనిపించడం లేదు. తెగిన చెరువులకు ఇంత వరకు మరమ్మతులు చేపట్టలేదు. ఇప్పటికే వర్షాలు కురుస్తున్నాయి. అధికారులు వెంటనే పనులు ప్రారంభిస్తే మాకు ఉపయోగం ఉంటుంది.

- అబ్బెంగుల నర్సయ్య, రైతు

పట్టించుకోవడం లేదు..



నవాబుపేట గ్రామ శివారులో గల వంక సముద్రం చెరువుతో పాటు సుబ్బక్కపల్లికి వెళ్లే దారి తెగిపోయి పది నెలలు అవుతున్న కనీసం అధికారులు పట్టించుకోవడం లేదు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఆరు నెలలు కావస్తున్న ఈ చెరువు, రోడ్డుపై చేయించాలనే ధ్యాసే లేదు. చెరువు కింద ఉన్న రెండు వందల మంది రైతులు వరి పంటలు పండించుకుని జీవనోపాధి పొందుతారు. వెంటనే మరమ్మతులు చేయించాలి.

- సాద రాజు, నవాబుపేట

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



అవగాహన కల్పిస్తున్న పోలీసులు

టేకుమట్ల: సైబర్ క్రైంపై అప్రమత్తంగా ఉండాలని ఏఎస్సై పింగిళి అమరేందర్‌రెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలో ఆన్‌లైన్ మోసాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుర్తు తెలియని వ్యక్తులు ఫోన్ చేసి ఓటీపీ నంబర్ చెప్పమని అడుగుతారని నమ్మి ఓటీపీ చెప్తే బ్యాంక్‌లో నగదు విత్‌డ్రా చేస్తారన్నారు. సైబర్ క్రైం ఉచ్చులో చిక్కుకుని నగదు పోగొట్టుకుంటే వెంటనే 1930 నంబర్‌కి కాల్ చేసి, స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు. అలాగే ఫేస్‌బుక్, వాట్సాప్, ట్విట్టర్‌లలో ఫేక్ డీపీలతో బాలికలను ఆకట్టుకునేలా చేసి ఫొటోలను తీసుకుని బ్లాక్‌మెయిలింగ్‌కు పాల్పడుతూ తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తారన్నారు. బాలికలు సెల్‌ఫోన్‌లో గుర్తు తెలియని వ్యక్తులతో చాటింగ్ ప్రమాదకరమన్నారు. కావున సోషల్ మీడియా పట్ల ప్రతీఒక్కరు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ వెంకటేశ్వర్‌రావు, మల్లన్న, మహిళా కానిస్టేబుళ్లు రంజిత, స్వప్న, తదితరులు ఉన్నారు.

వర్మికంపోస్టు ఎరువు విక్రయం




వర్మికంపోస్టు కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం మద్దులపల్లి గ్రామ పంచాయతీలో తయారు చేసిన వర్మికంపోస్టు ఎరువును ఎంపీడీఓ కే.వెంకటేశ్వర్లు పరిశీలించారు. శనివారం ఆయన పంచాయతీలో వెర్మికంపోస్టు 20కిలోలను రూ.200లకు విక్రయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వర్మి కంపోస్టు విక్రయంతో పంచాయతీకి ఆదాయం సమకురుతుందన్నారు. ఇప్పటికే 9పంచాయతీల్లో కంపోస్టు ఎరువు తయారీ చేస్తున్నట్లు తెలిపారు. త్వరలో మండల కేంద్రంలో వర్మికంపోస్టు స్టాల్ ఏర్పాటు చేస్తామన్నారు. మండలంలోని ప్రతి పంచాయతీలో తయారు చేసిన వర్మి కంపోస్టును త్వరలో విక్రయిస్తామన్నారు. ఆయన వెంట కార్యదర్శి స్వాతి ఉన్నారు.

రేషన్‌కార్డుకు ఈ-కేవైసీ తప్పనిసరి

మొగుళ్లపల్లి: రేషన్‌కార్డు కలిగిన ప్రతి ఒక్కరూ ఈ-కేవైసీ తప్పకుండా చేయించుకోవాలని తహసీల్దార్ సునీత తెలిపారు. శనివారం మండలంలోని తహసీల్దార్ కార్యాలయంలో అన్ని గ్రామాల రేషన్ షాప్ డీలర్లతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. డీలర్లు గ్రామంలో రేషన్ కార్డులో ఉన్న ప్రతి ఒక్కరికి ఈ-కేవైసీ చేయించాలని ఒక్కరు కూడా మిగలకుండా వంద శాతం ఈ కేవైసీ చేయించాలన్నారు. ఈ సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ వేణుగోపాల్, ఆర్ఐ సురేందర్ రెడ్డి మండలంలోని రేషన్‌డీలర్లు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ సునీత

క్రీడా దుస్తుల పంపిణీ



దుస్తులు అందజేస్తున్న సాగర్

కాటారం: జిల్లా స్పోర్ట్స్ అథారటీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన వేసవి శిక్షణా శిబిరంలో పాల్గొంటున్న విద్యార్థులకు టీచర్ వావిళ్ల సురేందర్ స్మారకార్థం ఆయన కుమారుడు సాగర్ శనివారం క్రీడా దుస్తులను పంపిణీ చేశారు. విద్యార్థులకు దుస్తులు అందజేయడం సంతోషకరమని పలువురు సాగర్‌ను అభినందించారు. మండల కేంద్రంలోని టీచర్స్ కాలనీలో కొనసాగుతున్న వేసవి ఉచిత శిక్షణ శిబిరాన్ని 14 సంవత్సరాలలోపు చిన్నారులు సద్వినియోగం చేసుకోవాలని ఖోఖో కోచ్ అశోక్‌కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ ఉద్యోగులు శ్రీనివాస్, సందీప్, భాస్కర్, ఉపాధ్యాయులు అనిల్, సాంబశివుడు, నాగరాజు, మోహన్, సీనియర్ ఖోఖో ప్లేయర్స్ మంథెన శ్రీనివాస్, సృజన్, యువకులు పాల్గొన్నారు.

ఇద్దరిపై కేసు నమోదు

భూపాలపల్లి అర్బన్: పోలీస్ కానిస్టేబుల్‌పై దురుసుగా ప్రవర్తించి విధులకు ఆటంకం కలిగించిన ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై సుధాకర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని మంజూర్‌నగర్‌కు చెందిన గుత్తికొండ రాము, గుత్తికొండ మహేష్‌లపై కేసు నమోదు చేయడం జరిగిందన్నారు. గుత్తికొండ రాము భార్య గౌతమీ తన భర్త, మరిది మహేష్, అత్తమామ లక్ష్మి సంపత్‌లు శారీరకంగా మానసికంగా హింసిస్తున్నారని ఇటీవల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా భర్త రామును తీసుకురమ్మని రాజు అనే కానిస్టేబుల్‌ను పంపగా రాజు విధులకు ఆటంకపరిచినట్లు తెలిపారు. దీంతో రాము, మహేష్‌లపై కేసు నమోదు చేయడం జరిగిందన్నారు. ఎవరైనా పోలీస్, ప్రభుత్వ ఉద్యోగుల వీధులకు ఆటంకపరిస్తే కఠిన చర్యలు ఉంటాయన్నారు.

నాణ్యతగా కుట్టాలి

ఎస్ఎస్‌తాడ్వాయి: పాఠశాలల్లోని విద్యార్థుల యూనిఫాంలు నాణ్యతగా కుట్టాలని అడిషనల్ డీఆర్‌డీఓ బాలస్వామి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని తాడ్వాయిలో పాఠశాలల్లోని విద్యార్థులకు యూనిఫాంలు కుడుతున్న మహిళ సంఘాల సభ్యులతో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం స్వయం సహాయక సంఘాల మహిళలు ఆర్థిక అభివృద్ధి చెందాలనే ఉద్దేశ్యంతో యూనిఫాంల తయారీని మహిళా సంఘాలకు అప్పగించిందన్నారు. విద్యా సంవత్సరం పున:ప్రారంభానికి ముందుగానే విద్యార్థులకు యూనిఫాంలు అందించేలా చూడాలని సెంటర్ నిర్వాహకురాలికి సూచించారు. మహిళలు ఆర్థికంగా ఎదగడానికి ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని అన్నారు. ఆయన వెంట ఎంపీడీఓ సుమ నావాణి, ఐకేపీ ఏపీఎం శ్రీనివాసర్‌రావు తదితరులు ఉన్నారు.

ధాన్యం కోతలపై రైతుల ఆగ్రహం



రైతులతో మాట్లాడుతున్న డీఎం రాఘవేంద్ర

కాటారం: కాటారం మండలం దామెరకుంటలో మ్యాక్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రంలో సెంటర్ నిర్వాహకులు, రైస్ మిల్లర్ యజమాని కుమ్మక్కై అడ్డగోలుగా ధాన్యం కోతలు పెడుతున్నారని శుక్రవారం రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్రంలో ధాన్యం కొనుగోళ్ల పరిశీలనకు వచ్చిన సివిల్ సప్లయిస్ జిల్లా మేనేజర్ రాఘవేంద్ర దృష్టికి తీసుకెళ్లి ఆయన ఎదుట నిరసన తెలిపారు. కోతలపై పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసిన చర్యలు తీసుకోవడం లేదని డీఎంతో వాగ్వాదానికి దిగారు. ధాన్యం తూకంలో కోతలపై రైతులు, సెంటర్ నిర్వాహకుల నుంచి డీఎం వివరాలు తీసుకొని నమోదు చేసుకున్నారు. రైతులు ఆందోళన చెందవద్దని తేమ, తరుగు పేరిట ఎలాంటి కోతలు పెట్టకుండా ధాన్యం కొనుగోళ్లు జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారు. అనంతరం అంకుషాపూర్‌లోని రైస్ మిల్లు వద్దకు వెళ్లి ధాన్యం కోతపై విచారణ జరిపారు. రైతులకు సమాచారం లేకుండా ఎలాంటి కోతలు విధించవద్దని నిర్వాహకులకు తెలిపారు. ఈ విషయమై డీఎం రాఘవేంద్రను సాక్షి వివరణ కోరగా కేంద్రం నుంచి రైస్ మిల్లుకు తరలించిన కొన్ని వాహనాలకు సంబంధించి తూకంలో వ్యత్యాసం ఉన్నట్లు గుర్తించినట్లు తెలిపారు. తూకంలో వ్యత్యాసం వచ్చినపుడు వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని సెంటర్ నిర్వాహకులు, రైస్ మిల్లు నిర్వాహకులకు సూచించినట్లు డీఎం పేర్కొన్నారు.

తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేస్తాం..



తడిసిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న ప్రకాశ్‌రావు

మల్హర్: అకాల వర్షాలతో తడిసిన ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని రైతులు అధైర్యపడవద్దని పీఏసీఎస్ వైస్ చైర్మన్ మల్క సూర్యప్రకాశ్‌రావు అన్నారు. మండలంలోని తాడిచర్లలో గత శుక్రవారం కురిసిన అకాల వర్షంతో తడిసిన ధాన్యాన్ని డైరెక్టర్లు మెండి, తిరుపతిరావులతో కలసి ప్రకాశ్‌రావు శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తడిసిన, రంగు మారిన ధాన్యాన్ని ప్రభుత్వం తప్పకుండా కొనుగోలు చేస్తుందని రైతులకు భరోసా కల్పించారు. తడిసిన ధాన్యాన్ని రైతులు ఆరబోట్టాలని వివరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కిషన్ నాయక్, ఐలయ్య, రైతులు పాల్గొన్నారు.

వీరబ్రహ్మేంద్ర స్వామి ఆరాధన మహోత్సవం



హోమం కాల్చుతున్న భక్తులు

రేగొండ: మండలంలోని రంగయ్యపల్లి గ్రామంలో శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆరాధన మహోత్సవాన్ని విశ్వబ్రహ్మణుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేద పండితులు వేద పద్యాలతో ఆరాదన మహోత్సవం, యజ్ఞ పూజలు, హోమాలు నిర్వహించారు. భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి, తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఈ ఆలయాన్ని ప్రభుత్వం గుర్తించి ఆలయ అభివృద్ధికి తోడ్పడాలని విశ్వబ్రహ్మణ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్లు కోరారు. మండల అధ్యక్షుడు లక్ష్మణమూర్తి, గ్రామ కమిటీ అధ్యక్షుడు రమేష్, సభ్యులు భిక్షపతి, విష్ణుమూర్తి, గురుమూర్తి, దేవేందర్, వేణు, సమ్మయ్య, సంతోష్, రాజు, సూర్యం, రవి, రాజయ్య, లింగమూర్తి, మల్లయ్య, చంద్రమౌళి పాల్గొన్నారు.

వ్యాధులపై అవగాహన కల్పించాలి



మాట్లాడుతున్న అప్పయ్య

మంగపేట: రాబోయే వర్షాకాలంలో సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలని వైద్యాధికారులు, సిబ్బందికి డీఎంహెచ్ఓ అల్లెం అప్పయ్య ఆదేశించారు. మండల పరిధిలోని మంగపేట, చుంచుపల్లి, బ్రాహ్మణపల్లి పీహెచ్‌సీలు, పలు సబ్‌సెంటర్లను ఆయన శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. మొదటగా ఆయన కోమటిపల్లి సబ్ సెంటర్ పరిధిలోని ముక్కిడిపోచమ్మగూడాన్ని సందర్శించి గ్రామంలో వైద్య సిబ్బంది నిర్వహించిన కార్యక్రమంపై ఆరా తీశారు. అనంతరం బ్రాహ్మణపల్లి పీహెచ్‌సీని తనఖీ చేసి వైద్యాధికారి, సిబ్బంది రిజిస్టర్‌తో పాటు నేషనల్ ప్రోగ్రామ్స్ రిజిస్టర్‌ను పరిశీలించారు. పీహెచ్‌సీలో మందుల స్టాక్ వివరాలను తెలుసుకున్నారు. ప్రధానంగా వర్షాకాలం సీజన్ సమీపిస్తుండటంతో పాము, తేలు కాటు మందులతో పాటు మలేరియా పరీక్షల కిట్లు, మందులకు ఇండెంట్ పెట్టి సమకూర్చుకోవాలని ఆదేశించారు. ముఖ్యంగా డెలివరీ కేసులు ఏమైనా ఉంటే పీహెచ్‌సీకి తరలించి ప్రసవాలు చేయాలని సూచించారు. అనంతరం చుంచుపల్లి పీహెచ్‌సీని సందర్శించి రేపటి నుంచి మల్లూరు గుట్టపై జరిగే లక్ష్మీనర్సింహస్వామి బ్రహ్మోత్సవాల జాతరలో ప్రత్యేక వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి భక్తులకు సకాలంలో మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు. అందుకు అవసరమైన మందులను సిద్ధం చేసుకోవాలని వైద్యాధికారి, ఫార్మసిస్టును ఆదేశించారు. అనంతరం మంగపేట పీహెచ్‌సీని తనిఖీ చేసి వైద్యులు, సూపర్‌వైజర్లు, ఏఎన్ఎంలతో సమావేశం నిర్వహించి వ్యాధులపై సబ్‌సెంటర్ వారీగా రివ్యూ నిర్వహించి వివరాలను అడిగి తెలుసుకున్నారు.

పిడుగుపాటుతో ఎద్దు మృతి



పిడుగుపాటుకు మృతి చెందిన ఎద్దు

కాటారం: పిడుగుపాటుతో ఎద్దు మృతి చెందిన సంఘటన కాటారం మండలం ఇబ్రహీంపల్లిలో శనివారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే ఇబ్రహీంపల్లికి చెందిన బొడ్డు సమ్మయ్య అనే రైతుకు చెందిన ఎద్దు పశుగ్రాసం కోసం శుక్రవారం ఇంటి నుంచి వెళ్లింది. వర్షం పడటంతో రాత్రి వరకు ఎద్దు ఇంటికి చేరుకోలేదు. ఉదయం సమ్మయ్య ఎద్దు కోసం ఆరా తీయగా సమీప పొలాల్లో పిడుగుపాటుకు గురై ఎద్దు మృతి చెందినట్లు గుర్తించారు. ఎద్దు విలువ సుమారు రూ.లక్ష వరకు ఉంటుందని బాధిత రైతు పేర్కొన్నాడు. ప్రభుత్వం ఆర్థిక సాయం అందించి ఆదుకోవాలని కోరారు.

విద్యుదాఘాతంతో..

కాటారం(మహదేవపూర్): విద్యుదాఘాతంతో దుక్కిటెద్దు మృతి చెందిన సంఘటన మండల కేంద్రంలో శనివారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే మహదేవపూర్ గ్రామానికి చెందిన పర్శవేన మహేశ్ అనే రైతు దుక్కిటెద్దును మేత కోసం వదిలాడు. కొత్తపేట శివారులోని పొలంలో పశుగ్రాసం మేస్తూ ఎద్దు ట్రాన్స్‌ఫార్మర్ ఎర్త్‌వైరును తాకింది. దీంతో షాక్ గురై దుక్కిటెద్దు అక్కడికక్కడే మృతి చెందినట్లు బాధిత రైతు మహేశ్ ఆవేదన వ్యక్తం చేశాడు. దుక్కిటెద్దు విలువ సుమారు రూ.60 వేలు ఉంటుందని ఆర్థిక సాయం అందేలా చూడాలని ప్రభుత్వాన్ని వేడుకున్నారు.

మొదలైన భక్తుల సందడి



ఆలయానికి తరలివస్తున్న భక్తులు



వంటా వార్పు చేస్తున్న భక్తులు



సేదదీరుతున్న భక్తులు

- నేటి నుంచి హేమాచల లక్ష్మీనర్సింహస్వామి బ్రహ్మోత్సవాలు
- ఆలయ పరిసరాల్లో షాపుల ఏర్పాటు

మంగపేట: మండలంలోని మల్లూరు శ్రీ హేమాచల లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో స్వామివారి బ్రహ్మోత్సవాలు(జాతర) ప్రారంభానికి ముందు రోజు నుంచే భక్తుల సందడి మొదలైంది. ఆదివారం నుంచి ఆలయంలో బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. శనివారం వివిధ ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు తరలి రావడంతో ఆలయ ప్రాంగణం భక్తుల కిటకిటలాడింది. ఆలయంలో స్వయంభు స్వామివారిని దర్శించుకునేందుకు సుదూర ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులతో పాటు అంజనేయస్వామి భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. ఆలయానికి వచ్చే భక్తులతో పాటు పది రోజుల పాటు జాతరలో స్వీట్ షాపులు, బొమ్మలు, గాజులు తదితర వ్యాపారులు షాపులను ఏర్పాటు చేసుకున్నారు. దీంతో బ్రహ్మోత్సవాల శోభ సంతరించుకుంది. రెండు తెలుగు రాష్ట్రాల్లోని వివిధ సుదూర ప్రాంతాల నుంచి తరలి వచ్చిన భక్తులు ఆలయ పరిసరాల్లో చెట్ల కింద వంటావార్పు చేసుకుని భోజనాలు చేశారు.

రైతులు జాగ్రత్తలు తీసుకోవాలి

ఎస్ఎస్‌తాడ్వాయి: రెండు, మూడు రోజుల్లో వర్షాలు కురువనుండడంతో వాతావరణశాఖ సూచనల మేరకు రైతులు ధాన్య తడవకుండా జాగ్రత్తలు తీసుకోవాలని మండల వ్యవసాయశాఖ అధికారి పోరిక జైసింగ్ సూచించారు. శనివారం మండలంలోని గంగారం, కాటాపూర్ గ్రామాల్లో పీఏసీఎస్, ఎంఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన పరిశీలించారు. వర్షాలకు ధాన్యం తడకుండా ముందస్తుగా టార్పాలిన్ కవర్లను అందుబాటులో ఉంచుకోవాలని రైతులకు సూచించారు.

కన్నాయిగూడెం : మండలంలో రైతులు పండించిన పంటలను రక్షించుకునేందుకు అప్రమత్తంగా ఉండాలని ఏఈఓ కల్యాణి అన్నారు. మండలంలోని ఓడీఎంఎస్ వ్యవసాయ కొనుగోలు కేంద్రాన్ని ఆమె సందర్శించారు. కొనుగోలు కేంద్రంలోని ధాన్యాన్ని పరిశీలించి రైతులు ధాన్యాన్ని తడవకుండా కావల్సినన టార్పాలిన్లు అందుబాటులో ఉంచుకోవాలన్నారు.